

మాడుంబ నరసింహాచార్యులుగారు

౧

కృష్ణారావును, సీతారామశాస్త్రియును బాల్య స్నేహితులు; బ్రాహ్మణ కులస్థులు. కృష్ణారావింటి పేరు కలగరపువారు. అతని నివాసస్థలము రాజమహేంద్రవరము. సీతారామశాస్త్రి యింటిపేరు పెద్దాడవారు. అతనిపితరులు తమ నివాసస్థలమగు రాజానగరము విడిచిపెట్టి కొడుకుల ఇంగ్లీషుచదువులకోసము రాజమహేంద్రవరము వచ్చి చేరునప్పటికి సీతారామశాస్త్రికి ఆరేండ్లకన్న నెక్కువలేవు. కృష్ణారావునకును సరిగా అదేవయస్సు. కలగరపువారింటి కెదురుగానే పెద్దాడవారి బస యుండేది. అప్పటినుండియు చదువులు, ఆటలు, షికార్లు, చిరుతిండ్లు, ఒకటేమిటి, అన్నిటిలోను ననుదినము కలిసికొనుచు కృష్ణారావును, సీతారామశాస్త్రియును చాలా చనువుగా నుండేవారు. వారి స్నేహము ఆలాగు సుమారు పండ్రెండు సంవత్సరాలు నిరంతరాయముగా సాగినది. తరువాత గ్రామాంతరములందుండవలసి వచ్చుటచే ఏ అయిదారేండ్లో మాత్రమే వారి కెడబాటు గల్గినది అటుపిమ్మట దైవవశాత్తు వారుభయులును కాకినాడలోనే మకాము పెట్టుట తటస్థించినది. ఆ బాల్యస్నేహితు లిద్దఱును రామారావుపేటలోనే సమీపగృహములలో బసచేసినారు.

సాధారణముగా సమానపరిస్థితులలో నున్నవారికే గాఢమైన స్నేహము కుదురునని లోకులు చెప్పుచుందురు. కాని యీసూత్రము వీరివిషయములో భ్రాంతిగా వర్తింపలేదు. కృష్ణారావు గృహస్థాశ్రమములో ప్రవేశించి అప్పుడే ఇద్దరుబిడ్డలతండ్రి యైనాడు. ఇంగ్లీషువర్తక కంపెనీలో గుమాస్తాగానుండి నెలకు వందరూపాయలు తెచ్చుకొనుచున్నాడు. తండ్రి కొద్దికాలముక్రిందటనే చనిపోవుటచేత రాజమహేంద్రవరములోని యిల్లు అద్దెకిచ్చి అతనితల్లియు, సోదరీసోదరులును కూడ కాకినాడలో కృష్ణారావువగ్గరనే ఇప్పుడు వాసముచేయుచున్నారు.

సీతారామశాస్త్రి పరిస్థితులు వేరు. అతని తలిదండ్రులిద్దరును బాగున్నారు. వారిప్పుడు తమ తక్కిన ఇద్దఱు మగపిల్లలకును ఇద్దఱు ఆడపిల్లలకును చదువు చెప్పించుకొనుచు రాజమహేంద్రవరములోనే యున్నారు. సీతారామశాస్త్రి బి. ఏ. పరీక్షకు దరఖాస్తు పెట్టియుండియు డిగ్రీ ఆశ సైతము విడిచివైచి సహాయ నిరాకరణ సందర్భమున ఇంగ్లీషువిద్యకు స్వస్తి చెప్పినాడు. పిమ్మట గవర్నమెంటు ఉద్యోగములో ప్రవేశించుట కిష్టపడక తన జీవితమును దేశసేవయందే గడుప ప్రతిజ్ఞపట్టినాడు. అయినను అతనితండ్రియగు కామశాస్త్రిగారికి మాత్ర మింకను పాశ్చాత్యవిద్యావ్యామోహ మేమాత్రమును సడలలేదు. ఆయన స్వగ్రామమందలి తనగృహమును పాడుపెట్టి అద్దెయిండ్లలో పట్టణవాసక్లేశ మనుభవించుచు బిడ్డలను ప్రభుత్వోద్యోగ స్వీకారమునకు తయారు చేయుచుండెను. పరాధీన స్థితిలో నున్న భారతప్రజల కెదురుగా కనబడుచుండు బ్రతుకుతెర వొక్క ఉద్యోగస్వీకారమే గదా!

సీతారామశాస్త్రి నాలుగేండ్లపాటు ఏదో పల్లెటూరిలో మకాముపెట్టి సొంతవ్యవసాయము చేసినాడు. కాని మున్ముందు పత్రికాసంపాదకత్వము వహించి తన దేశభాషాపాండిత్యమును, ఆంగ్లభాషాప్రవీణతయు సార్థకపడునట్లు దేశసేవచేయ నుత్సహించుచున్న యాయువకునకు పల్లెటూరిజీవనము సరిపడనందున నతడు తనమకామును కాకినాడకు మార్చి ఇంగ్లీషు దినపత్రికలకు వార్తలను, వ్యాసములను వ్రాసిపంపి కొంత ధనము సంపాదించుచు అక్కడ సుఖముగనే కాలక్షేపము చేయ ప్రారంభించెను. అతడింతవరకు వివాహమే చేసుకోలేదు. బ్రహ్మచర్యదీక్ష నవలంబించి నిరాడంబర జీవనము చేయుచుండెను. విధవరాలగు నతని మేనత్త మాత్రమే సంరక్షకురాలై యతని గృహమునందుండెను.

గృహపరిస్థితులందే కాక మత సాంఘిక రాజకీయములందు కూడ ఈబాల్యమిత్రు లిరువురు భిన్నాభిప్రాయులే. సీతారామశాస్త్రి సనాతనమతావలంబి; కృష్ణారావు సంఘసంస్కరణాభిలాషి. సీతారామశాస్త్రి శుద్ధఖద్దరు వస్త్రధారి. స్వదేశపరిశ్రమలకు ప్రోత్సాహము కలిగించుటవలననే దేశదారిద్ర్యము తీరి, భావదాస్యముపోయి, ఆర్థికముగను, రాజకీయముగను దేశ మౌన్నత్యము నొందు నను నభిప్రాయము గలవాడు. కృష్ణారావునకు ఖద్దరువస్త్రధారణదీక్ష లేదు. అతడు తరుచు మిల్లునూలు బట్టలే కట్టుచుండును. యంత్రసహాయము లేనిది మనము కేవలము చేతిపనులవలన పాశ్చాత్యులతో ఏవిషయమునను పోటీ చేయలేమని యతనివాదము.

ఇట్లీయుభయులకు గల భేదములే పోలికలకన్న నెన్నోరెట్లెక్కువగ నున్నవనుట స్పష్టము. కాని వారి యుభయుల మధ్య గాఢముగ నాటుకొనియున్న స్నేహలత దుర్భేద్యమై, నిష్కళంకమై, యనివార్యముగ సాగుచునే యున్నది. వారు దినమున కొకసారియైన తప్పక కలిసికొని సంతోష సల్లాపములచే కాలము బుచ్చుచుందురు. తరుచుగా సాయంసమయములందు షికారుపోయి యిసుకపఱ్ఱలో కూర్చుండి సాంఘిక రాజకీయాది విషయములను గూర్చి దీర్ఘప్రసంగములు గావించుచుందురు.

సీతారామశాస్త్రి యెంత సనాతనమతాభిమానిగ నుండదలచుకొన్నను బాలవితంతువుల దురవస్థ దలచినప్పుడు మాత్ర మాతనిహృదయము చలించిపోవుట మానలేదు. వితంతుబాలికల దుస్థితినిగూర్చి వ్రాసిన గాంధిమహాత్ముని వ్యాసములును, ప్రముఖులగు బ్రహ్మమతావలంబుల వ్రాతలును ఎప్పటికప్పుడు తెచ్చి చూపి కృష్ణారావు సీతారామశాస్త్రి భావములందు మార్పుగలిగింప జూచుచుండెను. అది యట్లుండ రమారమి ఒక సంవత్సరకాలమునందే శాస్త్రి దగ్గరబంధువులలో ముగ్గురు బాలికలు వితంతువులైపోయిరి. ఆ వితంతు బాలికల దురదృష్టమును గూర్చి యీ మిత్రు లిర్వురు చాలదినములు విచారించినారు. వితంతూద్వాహములను గూర్చి యీయుభయులమధ్య నెన్నియో ప్రసంగములును, వాదప్రతివాదములును నడిచినవి. ఆవాదములందు శాస్త్రిహృదయము తామరాకుమీది నీటిబొట్టువలె సంచలింపజొచ్చెను. తనహృదయాకాశమున మెరుపువలె నప్పుడప్పుడు మెఱయుచుండు నొక పూర్వవిషయమప్పుడు శాస్త్రిస్మృతిపథమున సాక్షాత్కరించెను.

చామనచాయ మేను, చంద్రబింబమువంటి మొగము. చారెడేసికండ్లు. మంచి చుఱుకుతనము గలిగి మహాలక్ష్మి యను సార్థకనామముతో నొప్పు సుమారు పదహారు సంవత్సరముల యీడుగల యొక వితంతుయువతితో నత డప్పుడప్పుడు సంభాషించియుండెను. ఆయువతి నివసించిన గృహము రాజానగరములో శాస్త్రి యింటికి పోవుదారిలోనే యున్నది. వారింటిపేరు క్రొత్తపల్లివారు, మతనైతికసాంఘికరాజకీయాది విషయములందామెకు గల పరిజ్ఞానమును ఆధ్యాత్మికజ్ఞానార్జనమునందామెకుగల ఉత్కంఠయు దలచి తానొకప్పుడు ఆశ్చర్యముచే సమ్మోహితుడైపోయిన సంగతి యతని మనోనేత్రమున కప్పుడు గోచరించెను. అట్టి విద్యావతియగు వితంతుయువతి యందచందము లడవి గాచిన వెన్నెలయై పోవుట శుద్ధ అన్యాయమని యతనికి దోచెను. ఆమె తన్ను తప్పక కామించియున్నదనియు, దనకు వివాహేచ్ఛయున్నను లేకున్నను ఆమెజీవితమును సౌఖ్యవంతముగ నొనర్చుటకైన తానామెను తప్పక వివాహమాడితీరవలె

ననియు నతనికి దన యంతర్వాణి ప్రబోధించుచున్నట్లు పొడగట్టెను.

మహాలక్ష్మినిగూర్చి తా నెఱిగిన ముఖ్యవిషయములు కొన్ని శాస్త్రి కృష్ణారావున కెఱుకపర్చి మఱియు నిట్లనియెను. "గతపర్యాయము రాజానగరము వెళ్లి నప్పుడు ఆయింటిలోనివా రందరు నాకు పరమాప్తులుగా కనబడిరి. మహాలక్ష్మి తనకు నాయందుగల పూజ్యభావమును వెల్లడించుచు నెంతోచనువుగా తనకష్టసుఖములు నాతో చెప్పుకొన్నది. ఆయింట్లో నప్పుడు మహాలక్ష్మియు, ఆమె నాయనమ్మయు, మేనత్తయగు సుబ్బలక్ష్మమ్మయు, తమ్ముడగు కేశవరావును ఉన్నారు. స్త్రీలు ముగ్గురును వితంతువులే. మహాలక్ష్మికిమాత్రము వైధవ్యచిహ్నము లేమియు లేవు. ఆమె సౌభాగ్యవతివలె కలకలలాడుచు నవ్వుమొగముతోనే మాట్లాడినది. స్త్రీలోకమునంతను మాతృసమానముగ జూచుచు యావజ్జీవము బ్రహ్మచర్యమవలంబించియుండుట మోక్షప్రాప్తికి సులభసాధనమని నమ్మియున్నవాడ నగుటచే, నే నింతవరకును వివాహమునకు విముఖుడనై యుంటిని. కాని విశాలహృదయముతో యోజించిచూచినకొలది సంసారసుఖము లనుభవింపవలెననిగంపెడాసతో నువ్విళ్లూరుచుండు ముగ్ధలగు నట్టి బాలవితంతువులకునిర్బంధవైధవ్యము విధించుట నిర్దాక్షిణ్యమని నాకు స్ఫుటముగ గోచరించుచున్నది. కావున నే నిప్పుడు బయలుదేరి రాజానగరముపోయి అక్కడ కొన్నాళ్లుండి మహాలక్ష్మికిని నాకును పరస్పరానురాగము కుదిరినచో నామెను తప్పక వివాహమాడెదను. అట్టి సంఘటనము లభింపనిచో నేను యావజ్జీవము బ్రహ్మచారిగానే యుండి పోవుదును. ఇదే నానిశ్చయము."

కృష్ణారావున కతనిమాట లత్యధికముగ నద్భుతానందములు కల్గించెను. శాస్త్రి మంచి పట్టుదలగలవాడు. కార్యశూరుడు. తాను నమ్మిన దానిని తప్పక ఆచరణలోనికి దేగలిగినవాడు. అందుచే శాస్త్రి సంఘసంస్కర్తగ మారినచో దేశమున కెంతో లాభము చేకూరగలదని కృష్ణారావు నిజముగా నుప్పొంగిపోయెను. శాస్త్రి తా నాదినముననే ప్రయాణమై వెడల నిశ్చయించుకొన్నందున కృష్ణారావు ననుమతి గొని స్వగృహమునకేగెను. పిమ్మట నతడు తన మేనత్తకోరిక ననుసరించి యామెను రాజమహేంద్రవరములో తమయింట దిగబెట్టి "వివాహార్థమై కన్యాన్వేషణమున కరుగుచుంటి" నని మాత్రము తలిదండ్రులతోను, మేనత్తతోను చెప్పి వారి యొద్ద సెలవుగైకొని యతడు రాజానగరము ప్రయాణమైపోయెను.

## ౨

సీతారామశాస్త్రి రాజానగరము పోయియుండి మూడుమాసములు కావచ్చినది. ఈలోపుగ కృష్ణారావున కతనియొద్దనుండి రెండుత్తరములు మాత్రమే వచ్చినవి. ఆయుత్తరములనుబట్టి ఒకయేడాదిక్రితమే-అనగా గతపర్యాయము శాస్త్రి మహాలక్ష్మితో మాట్లాడివెడలిన కొద్దినెలలలోనే-ఆమె తల ముండనముచేయించుకొని నాటినుండియు వైధవ్యధర్మములన్నియు యథావిధిగ నిర్వర్తించుచు విరాగిణియైయున్నదని యతనికి తెలియవచ్చెను. శాస్త్రియత్నములు తాననుకొన్నంత సులభముగ సఫలమగుసూచన లేమియు గానరావని కృష్ణారావు తలపోయుచుండెను. రాజానగరముపోయి తనకు తెలియవచ్చిన మహాలక్ష్మి విచిత్రవృత్తాంతమంతయు గన్నులార గాంచవలెనని యొకటి రెండు సారులు కృష్ణారావనుకొనెను. కాని, యాయాలోచనలు క్రియారూపము వహింపవయ్యెను.

ఒకనాడు కృష్ణారావు మధ్యాహ్నభోజనముచేసి వచ్చి తమసావడియందున్న మడతకుర్చీలో పరుండియుండెను. అది క్రిస్టమసు సెలవులకు ప్రారంభదిన మగుటచే ఉద్యోగవ్యవహారపు తొందర లేమియు లేక అతడు నిశ్చింతగ విశ్రాంతి గైకొనదలచెను. కాని దేశమందలి రాజకీయసాంఘిక పరిస్థితులనుగూర్చిన భావపరంపర లతని మెదడునజేరి పనిచేయుచు నతని చిత్తవిశ్రాంతి కించుక భంగము కలిగించుచుండెను. ఇంతలో తపాలామనిషి వచ్చి కొన్నియుత్తరములును, ఒకటి రెండు వార్తాపత్రికలును, భారతి మాసపత్రికయును బల్లమీద పడవైచి వెళ్లిపో

యెను. కృష్ణారావు ముందునకు వంగి బల్లమీది ఉత్తర ములు తీసి చదువుకొనెను. అందులో శాస్త్రి వ్రాసిన ఉత్తరమేదియు లేనందున అతని కాశాభంగము కలిగెను. వార్తాపత్రికలు చదువుటకు బద్ధకము తోచినను చిత్రము లును కథలోని బొమ్మలునైన చూచు నభిలాషతో నతడు భారతి నందుకొనెను. కాని ఇంతలో శాస్త్రి సంగతి తలపునకు రాగా నత డేమేమో యాలోచించుచు తెరచిన భారతీపత్రికను గుండలపై బెట్టుకొని కుర్చీలో జారగిలపడి పరుండెను.

అప్పటికే అరమోడ్పుగానున్న కృష్ణారావు కన్ను లకు క్రమముగా కునుకు వచ్చుచుండెను. ఆసమయములో



నెవరో వ్యక్తి మెల్లగా వెనుకనుండివచ్చి యతని కన్నులు మూసెను. హఠాత్తుగా నిద్రాభంగ మగుటచేత నత డులిక్కిపడి యెవరా అంతచనువుగా తనకన్నులు మూసి నవారని యాశ్చర్యపడెను. ఆరేండ్ల యీడుగల యతని కుమార్తె తండ్రియెడ మిక్కిలి చనువుగా వర్తించు నభ్యా సము గలిగి తరుచుగా కొంటెపనులు చేయుచుండును. ఆబాలికయేమో యని యతడు చేతులు తడిమి చూచెను కాని యవి చిన్నపిల్లచేతులు కావు. "ఎవ రా మోటు తనము?" అని ఒక కేకవేసి అతడు చేతులు త్రోసి వైచి వదలించు కొనెను. నవ్వు మొగముతో సీతారామ శాస్త్రి వచ్చి యెదుట నిలువబడెను.

"ఓహో! నీవేనా? అప్పుడే యెట్లు వచ్చితివి?" అనుచు కృష్ణారా వతనిని సంతోషముతో తనప్రక్క నున్న కుర్చీలో కూర్చుండ బనిచెను. శాస్త్రి కూర్చుండి, "నేను ఉదయము తొమ్మిదిగంటలకే వచ్చినాను. కాని వచ్చిన వెంటనే విసుగుగా నుండుటచే నిక్కడకు రాలే కపోయినాను" అనెను.

"మీ మేనత్తను రాజమండ్రిలో దిగబెట్టి నట్టు న్నావే. తిన్నగా ఇక్కడికే రాక నీవు మాయింటి కెందుకు వెళ్లినావు?"

"వచ్చేటప్పుడు మా మేనత్తను మఱల తీసికొని వచ్చినాను."

"వెళ్లిన పని యేమైనది? కాయా, పండా?"

"(చిరునవ్వుతో) కాయా లేదు - పండూ లేదు. ప్రోడే."

"(నవ్వుచు) ప్రోడేమిటి? పెండ్లి లేకుండ ఇంకా ప్రోడులాగున ఉంటా వన్నమాటా?"

"అది చాలాకథ ఉన్నది. సావకాశముగా చెప్ప వలెను."

"ఇంకా సావకాశ మేమిటి? ఈ వారమురోజులు మాకు సెలవులే గనుక నీయిష్టము వచ్చినంత విరళముగా మీ వాదప్రతివాదములు ప్రదర్శింతువు గాని_ముందుగా మహాలక్ష్మి నిన్ను వివాహమాడుట కంగీకరించినదా, లేదా? ఒక్కమాటలో చెప్పివెయ్యి."


"కృష్ణారావూ! ఎందుకు నీ కా తొందర? మా వాదప్రతివాదములు సంపూర్ణముగ విన్నతర్వాత నే నవి వాహితుడగా నుండిపోవుటలో నాది తప్పిదమగునో కాదో నీవే నిర్ణయింతువుగాని.

ఆమాట వినగానే కృష్ణారావు మనస్సు చివుక్కుమనెను. వేవేగ రాజానగర వృత్తాంతము విని తన మిత్రునితో వాదించుట కతనిమనస్సు ఉరుకులెత్తుచుండెను.

శాస్త్రి తనకథ నిట్లు ప్రారంభించెను:—

"నేను మామేనత్తను రాజమహేంద్రవరములో మాయింట దిగబెట్టితిని. అక్కడ రెండు అరటిపండ్ల గెలలు, కొన్ని నారింజపండ్లు కొని పట్టించుకొని వెంటనే ప్రయాణమై నేను రాజానగరము పోయితిని. ఆగ్రామములో నాబండిని తిన్నగా క్రొత్తపల్లివా రింటివద్దకు పట్టించినాను. నేను పండ్లువగైరా సామాను సావిట్లో దింపించి అద్దెయిచ్చి బాడివానిని పంపించివైచితిని. అవ్వగారు సావిట్లో- నే ననుకొన్నట్లే - తనమామూలుచోట కూర్చుండి యున్నది. ఆవిడకు గట్టిగా చెప్పుతేనే కాని మాట వినపడదు. నేత్రపాటవముకూడ ఇప్పు డిప్పుడే తగ్గుచున్నది. నేను దగ్గరకువెల్లి చేతులు జోడించి, 'అవ్వగారూ! నమస్కారము - నేను - సీతారామశాస్త్రిని- పెద్దాడ కామశాస్త్రిగారి పెద్దబ్బాయిని' అని గట్టిగా చెప్పితిని. 'నాయనా! పెద్దాడారబ్బాయివా? ఎప్పుడు వచ్చినావు? ఎవరెవరు వచ్చినారు?' అని నెన్నో కుశల ప్రశ్నలు వేసి, ఆమె నన్ను దగ్గరగా కూర్చుండబెట్టుకొని, మీద చేయివైచి చాలా ఆదరముతో మాట్లాడ నారంభించినది. ఇంతలో సుబ్బలక్ష్మమ్మగారు చెంబుతో నీళ్లు తెచ్చిపెట్టి, కాళ్లు కడుగుకొమ్మనెను. కాళ్లు కడుగుకోగానే తుడుచుకొనుటకు గుడ్డ తెచ్చియిచ్చి, మూలనున్న కుర్చీ లాగి సావిడిమధ్యగా వేసి నన్నందు కూర్చుండుమనెను. నేను కుర్చీలో కూర్చుండగానే, 'మహాలక్ష్మీ! సీతారామశాస్త్రిగారు వచ్చినారే' అని కేకవేసెను. సంకోచ మెంతమాత్రము లేకయే ముసుగునం దిమిడియున్న చందమామవంటి మొగముతో మహాలక్ష్మి చక్కవచ్చినది అక్కడనున్న బల్ల నానుకొని నిలువబడి ఆమె 'ఇప్పుడు మీరు కాకినాడలో ఉంటున్నారా?' అని నన్ను ప్రశ్నించెను.

"నేను ఆశ్చర్యముతో, 'మీ కెవరు చెప్పినారు?' అంటిని. 'ఈమధ్య మేము రాజమహేంద్రవరము వెళ్లినప్పుడు మీబసలోనికి వెళ్లి మనవాళ్లందరిని చూచి మాట్లాడినాను. మీరూ మీమేనత్తగారూ కాకినాడలో ఉంటున్నారని మీ అమ్మగారు చెప్పినారు' అని మహాలక్ష్మి చెప్పెను. ఇంతలో సుబ్బలక్ష్మమ్మగా రొకసారి లోనికి వెళ్లి వచ్చి 'మీరు లేచి స్నానము చేయవచ్చును. వంటలు ఇందాకానె అయినవి. వేడినీళ్లుకూడా కాగి సిద్ధంగా ఉన్నవి' అని చెప్పెను. 'స్నానముచేయుటకు చిన్న ఖద్దరు బట్ట తెస్తాను, ఉండండి' అని మహాలక్ష్మి చకచక లోపలికి పోయినది. ఆమె తెచ్చియిచ్చిన ఖద్దరు అంగవస్త్రము కట్టుకొని స్నానము చేయుచుండగా మహాలక్ష్మి యెనిమిదేండ్ల ప్రాయముగల తనతమ్మునిచేతికి బెంగుళూరు చందనపు సబ్బుబిళ్లయు, ఖద్దరు తువాలును ఇచ్చి అవి ఉచితస్థానములందు పెట్టించి వెళ్లిపోయెను. సుబ్బలక్ష్మమ్మగారు ఇంట్లో పీటవేసి, బొట్టుపెట్టి, చెంబు వగైరా సిద్ధముగా నుంచిరి. భోజన సమయమందుకూడ మహాలక్ష్మియు, సుబ్బలక్ష్మమ్మయు



"ఇప్పుడు మీరు కాకినాడలో ఉంటున్నారా?"

నాతో చనువుగా తమకుటుంబవిషయములు, మాకుటుంబ విషయములు ఎన్నెన్నో మాట్లాడినారు. ముసలమ్మ గారు కూడ మధ్యమధ్య మాట్లాడుచు, మా పెద్దలకును, వారిపెద్దలకును గల గాఢమగు స్నేహమును వివరపరిచెను. భోజనము చేయగానే కేశవరావు వచ్చి, 'మామ గారూ! తాంబూలము వేసికొనండి' అని ఆకులు, వక్కలు వగైరా తాంబూలసామగ్రిగల పళ్లెమును తెచ్చి బల్ల మీద నుంచెను. వారింట్లో నందరు వైరాగ్యము బూనినవారే యై యుండగా ఏలక్కాయలు, లవంగాలు, జాపత్రి వగైరాలతో కూడిన తాంబూలమును, సుగంధపు సబ్బును వీరి కింతత్వరగా ఎట్లు వచ్చినవా యని నాకు మిక్కిలి ఆశ్చర్యమైనది. వారికి నాయందు గల ఆదరము వెనుకటికన్న నిప్పుడనేక మడుంగులు హెచ్చిపోయినందుకు గల కారణము నాకేమీ బోధపడలేదు. మా సొంత యింట్లో చాలా మరమ్మత్తులు చేయవలసిన అవసరము కూడా ఉన్నది. ఆమిషతో రెండుమాసములు మాయింట్లో వేరే మకాం పెట్టి యుండి వీరి కుటుంబవ్యవహారములు, వీరి యుద్దేశ్యములు పూర్తిగా కనిపెట్టవలెనని నేను నిశ్చయించితిని."

ఇంతవరకును కథ చెప్పి శాస్త్రి "నాలుగుగంటలైనది. మన మిక షికారు పోవుదము. హాయిగా ఇసుకపఱ్ఱ మీద కూర్చుండియే మనము తదనంతరవృత్తాంతము చెప్పుకొందము" అనెను. అంతట వారిరువురును లేచి వయ్యాళిజనిరి.

## 3

ఇసుకబయలు సమీపమున నున్న మామిడిచెట్టు నానుకొని కూర్చుండిన సీతారామశాస్త్రికిని, అతని కభిముఖుడై సమీపముననే మఠము వైచికొని కూర్చున్న కృష్ణారావునకును సంభాషణ ప్రారంభమైనది.

"కేశవరావు నన్ను తాంబూలము వేసికొమ్మని చాలా బలవంతపెట్టినాడు. నేను లవంగమొగ్గమాత్రము నోట్లో వేసికొని బ్రహ్మచర్యవ్రతమునం దుండుటచే తాంబూలము వేసికొనననిచెప్పి, అతనికి మనస్సమాధానమగునట్లు పూర్వకాలమునందలి బ్రహ్మచారులగు విద్యార్థుల నియమములను గూర్చియు, అట్టి నియమముల యుపయోగమును గురించియు వానికి కొంత బోధించితిని. మహాలక్ష్మి వచ్చి బహు ఆప్యాయముతో మా సంభాషణ వినెను. తరువాత నేను తెచ్చిన పండ్లన్నియు వారిద్దరిచే లోపల పెట్టించి ఇంట్లో అందరికి పెట్టుమని చెప్పినాను. మహాలక్ష్మి కొన్ని ఇంట్లో నలుగురికి పంచియిచ్చి మిగిలినవి జాగ్రత్తపెట్టినది.

"మఱునాడు మహాలక్ష్మి వర్ణాశ్రమధర్మములను గూర్చి ఆమెకు తోచిన సందేహములు కొన్ని నన్నడిగి తెలిసికొన్నది. నేను పత్రికలకు వ్యాసములు వ్రాయుచుందునని చెప్పినందున రాజకీయ సాంఘిక సంబంధములగు విశేషములు చెప్పుమని నన్నడిగె, నేను చెప్పినదంతయు మహాలక్ష్మియు, ఆమె మేనత్తయుకూడ ఎంతో ఉత్సాహముతో వినిరి. ప్రస్తావవశమున నేను 'ఇల్లు కొంచెము మరమ్మత్తు చేయించవలసి యున్నది. అందుచే



"సీతారామశాస్త్రికిని... కృష్ణారావునకును సంభాషణ ప్రారంభమైనది"

రేపటినుండి మాయింట్లో మకాంపెట్టి పనిచేయించుదును. బహుశః రెండుమూడు నెలలు ఇక్కడ కాపురం పెట్టవలసి వచ్చేలాగున కనబడుచున్నది. కనుక నేను వేరే మకాంపెట్టుటకు మీరు అడ్డుచెప్పకూడదు. ఒకటిరెండు రోజులలో మా మేనత్తనుకూడా రప్పిస్తాను.' అని చెప్పినాను. వా రెంతమాత్రము ఒప్పుకోలేదు. నేను చాలా సేపు వాదించినను ఏమీ ప్రయోజనము లేకపోయినది 'మీరు అటువంటి మాటలు ఎప్పుడు చెప్పబోకండి. ఇది మీసొంతయిల్లే అనుకోండి. మీ మేనత్తగారు వస్తే మరీ మంచిది' అని వారిద్దరు చెప్పిరి. అంతలో మావాదవైఖరిని కొంచెము పసికట్టిన అవ్వగారు దగ్గరకు వచ్చి కూర్చుండి నావీపుమీద చేయివైచి నిమురుచు, 'నాయనా! మీ అమ్మ, నాన్నగారూ వారూ కులాసాగా ఉన్నారా' అని మరల కుశలప్రశ్న చేసెను. 'ఆ-అంతా బాగున్నారు' అని నేను చాలాగట్టిగా చెప్పితిని. మహాలక్ష్మి చిరునవ్వు నవ్వుచు, 'మీరు అంతగట్టిగా మాట్లాడ నక్కర లేదు. ఆదృష్టిమీద నున్నప్పుడు ఎంత మెల్లిగా మాట్లాడినను వినబడుతుంది. ఆమె వేరేదృష్టిని ఉంటే మీరు ఎంత గట్టిగా మాట్లాడినా అవగాహనకాదు' అని చెప్పినది.


"అంతట సుబ్బలక్ష్మమ్మ అవ్వగారి కెదురుగా కూర్చుండి చేతితో సంజ్ఞచేయుచు నాకైనా స్ఫుటముగా వినబడనంత మెల్లగా 'వీరు తమయింట్లో వేరే మకాంపెడతారట-ఇక్కడఉండమంటున్నారు-రెండునెలలు ఈఊళ్లో ఉంటారట-వారి మేనత్తను తీసికొనివస్తారట' అని చెప్పినది. ముసలమ్మ ముసిముసినవ్వు నవ్వుచు, 'వెఱ్ఱినాయనా! రెండునెలలు కాదు, రెండుసంవత్సరాలు ఉండు. మేము మరీ సంతోషిస్తాము. నాయనా! నువ్వు తింటే తింటేనే మాకు ఖర్చు అయిపోతుందిటోయ్. నీవేమీ మొగమాటపడవద్దు. నీయిష్టమువచ్చినవేళకు వచ్చి నీవు భోజనము చేయవచ్చును. నీ వుంటే మాకు సంతోషమే కాని యెంతమాత్రమూ శ్రమ లేదు. నీవు వ్రాసికొందుకు కలాలూ, కాగితాలూ ఏమి కావలసివచ్చినా అమ్మాయిని అడిగిపుచ్చుకో. నీచదువూ, నీ తెలివితేటలూ, నీ మంచిగుణాలూ అమ్మాయి చెప్పినది. మాపుణ్యంకొద్దీ వచ్చినావు కాని లక్షరూపాయ లిచ్చినా నీవంటిమంచివాడు మాయింటి కెందుకు వస్తాడు నాయనా!' అనుచు నన్నెంతో పొగడినది.

"ఆమధ్య రెండుమూడుసార్లు మీరు వచ్చినప్పుడు మీతో కొంచెముసేపు మాట్లాడడంచేతనే ఎన్నో మంచివిషయాలు తనకు తెలిసినవని నా మేనగోడలు ఉప్పొంగిపోయినది. మీదగ్గర వరుసగా రెండుమూడు మాసాల పాటు గనుక దేశమును గురించియు, దేవునిగురించియు సంగతులు నేర్చుకుంటే తనసందేహాలు పోయి మనస్సంతుష్టి కలుగునని మామహాలక్ష్మి ఆమధ్య అనుచువచ్చినది. ఆదేవునికి మాయందు అనుగ్రహము వచ్చి మిమ్ము ఇక్కడికి పంపించినా డనుకొనుచున్నాము' అని సుబ్బలక్ష్మమ్మ ఎంతో సంతోషముతో మాట్లాడినది.

"వారిమాట యేమోకాని, నాకుమాత్ర మప్పుడు దేవుని యనుగ్రహము ప్రత్యక్షముగా గోచరించినది. ఆయింటిలోని మువ్వురువితంతువులును నిష్కపటవర్తనలనియు, పరమపవిత్రురాండ్రనియు కొద్దిరోజులలోనే నాకు గట్టినమ్మకము కలిగినది. వారిసద్వర్తనమును గ్రహించిన కొలది భగవంతుడు నాసంశయ నివృత్తికి చక్కనిమార్గము చూపెనని నాకు పట్టరాని సంతోషము కలిగెను. బాలవితంతువునకు పునర్వివాహము చేయుట ధర్మమా? కాదా? కామమును జయించుట మానవసాధ్యమేనా? సంతానవాంఛను చంపివేయుట పాపకార్యమా? పవిత్రకార్యమా? అను సంశయవిషయములను గూర్చి పండితులనుగాని, సంస్కర్తలనుగాని యడుగుటకంటె వైరాగ్యభావము పూని హృదయమును భగవన్నివాస యోగ్యముగ చేసికొని, బాహాటవర్తనయై యొప్పు మహాలక్ష్మివంటి వితంతుయువతినే యడిగి తెలిసికొనుట శ్రేష్ఠతరమని నాకుగల దృఢవిశ్వాసము ఫలించుటకు మంచియవకాశ మేర్పడినది.

"మాయింటిఖరమ్మతు రెండురోజులలోనే పూర్తి అయినది. సుబ్బలక్ష్మమ్మగారి యభీష్టమునననుసరించి అక్కడ నున్నంత కాలము, అనుదినమును మధ్యాహ్నభోజనములై కొంచెము విశ్రాంతి తీసికొన్న తర్వాత

శ్రీమదాంధ్రభాగవతమును, రాత్రిభోజనములైన కొంత సేపటికి శ్రీమదాంధ్ర వాల్మీకిరామాయణమును ప్రారంభించి ఒక్కొక్క గంటసేపు తప్పక చదివి ఆస్త్రీలకు వినిపించుట నాకార్యక్రమములో ఒక ముఖ్యభాగముగా ఏర్పర్చుకొనవలసివచ్చినది. మొదటివారములో మాత్రము నేనే చదివి అర్థము చెప్పుచు వచ్చేవాడను గాని పిమ్మట



అవ్వగారి కోరికపై మహాలక్ష్మి పుస్తకము చదువుటయు, నేను అర్థము చెప్పుటయు జరుగుచుండేది.

"సాధారణముగా నేను ప్రతిరోజున ఉదయమునను సాయంకాలముననుమహాలక్ష్మితో వివిధవిషయములనుగురించి ప్రసంగించుచు, మనదేశమందలి రాజకీయ సాంఘికపరిస్థితులనుగూర్చి నాకు తెలిసిన విశేషాంశములను ఆమెకు చెప్పుచుండెడివాడను.

వారింట్లో ఒక పెద్దబీరువానిండ విలువగల పుస్తకము లెన్నోయున్నవి. అవన్నియు మహాలక్ష్మి చదువుకొనుటకై కొని తెప్పించుకొన్న పుస్తకములే. అందులో విశేషభాగము ఆధునికగ్రంథకర్తలును, మహిళామణులును రచించిన నీతిబోధకములును, భక్తిపూరితములును నగు పద్య, గద్య, పద సంకలితములగు పుస్తకములున్నవి. మహాలక్ష్మిచేతను, ఆమె తమ్ముడగు కేశవరావుచేతను నే నాపుస్తకములన్నియు తీయించి ౧. సాంఘికములు, ౨. రాజకీయములు, ౩. నైతికములు, ౪. మతసంబంధములు, ౫. సారస్వతములు నను అయిదువిభాగములక్రింద ఏర్పాటించి, వానికి వేర్వేర నంబర్లు వేయించి, పుస్తకముల పట్టిక యొకటి తయారుచేయించి, ఏపుస్తకము తీయవలెనన్న ఆపుస్తకము సులభముగా తీయుటకు వీలగునట్లు చేయించితిని. కేశవరావు నే నేపని చెప్పినను వెంటనే చేయుచు నాయందెంతో భయభక్తులతో నుండేవాడు. నాకేపుస్తకము కావలసినను మహాలక్ష్మి నడిగి తెచ్చుట, నేను చదివివైచి మరలనిచ్చిన పుస్తకములు యథాస్థానమున నుంచుట మున్నగు పనులన్నియు విసుగులేకుండ కేశవరావే చేయుచుండెడివాడు. వానిలో కొన్ని పుస్తకములు నేను చాలకాలము క్రిందట చదివియుండినవే యయ్యును మరల ప్రత్యేకాసక్తితో చదువవలసినవాడనైతిని. అయింటిలో నాకు మొట్టమొదట పరమాశ్చర్యము కలిగించినవిషయమేమనగా, మహాలక్ష్మి ఒక్కొక్కప్పుడు తన జీవితమునందలి పరమగోప్యములైన విషయములు కూడ సంకోచములేమియు లేకుండ నాకు విస్పష్టముగ నిష్కల్మషహృదయముతో నెఱిగించుచుండెడిది. ఆసమయమున సుబ్బలక్ష్మమ్మ ఆమె ప్రసంగమున కెంతమాత్రము ఆటంకము కలిగింపకుండుటే కాక మాకట్టి సావకాశము బాగుగా కల్గించుటకై తాను దూరముగ పోయి యవ్వగారితో నేదో మాట్లాడుచుండియో, ఏవో గృహకృత్యములు కల్పించుకొనియో కాలక్షేపము చేయుచుండెడిది.

"నవయౌవనవతియగు మహాలక్ష్మి నావంటి యువకుడగు బ్రహ్మచారితో రహస్యభాషణములు చేయుచుండిన ట్లగపడుచుండినను అవ్వగారును, ముఖ్యముగా సుబ్బలక్ష్మమ్మయును నెట్టియనుమానములు లేక మాయందు పూర్ణవిశ్వాస ముంచ గల్గుట కేమికారణమో కొన్నాళ్ల వరకు నా కెంతమాత్రము బోధపడలేదు. కాని ఆమె

పవిత్రజీవనము ప్రత్యక్షముగ కనుచుండుటచేతను, ఆమె గావించుచుండు నిరంతర ప్రబోధము వలనను ఆవితంతువులిద్దరు కూడ నిష్కల్మషహృదయులుగ సంస్కరింపబడి, యామెయం దెంతో గౌరవభావము కలిగియుండుచున్నారనియు, మహాలక్ష్మి చేయు ప్రతిపనియును మహోద్దేశముతో జేయునేగాని ఎన్నడును నీచపుటూహలతో జేయదని వారికి గట్టినమ్మకము గలిగెననియు నేను పిమ్మట క్రమక్రమముగా గ్రహింపగల్గితిని."

కృష్ణా—(తొందరతో) నీవు అనవసర ప్రసంగాలచే వృథాగా కథ పెంచు చున్నావు. అంత సర్వస్వతంత్రంగా వర్తిస్తూన్న ఆబాలవితంతువును పునర్వివాహానికి ఒప్పించలేని నీఅసమర్థతను వెల్లడించే కథాభాగమును వేవేగ చెప్పి నీవు చేసికొనివచ్చిన పనిని విమర్శించడానికి నాకు కొంచెము అవకాశ మివ్వవలె.

శాస్త్రి—విమర్శనాలకు నీకు కావలసినంత అవకాశ మిస్తాను. మావివాహ ప్రసంగాలను గురించి చెప్పుటకు ముందు ఆమెజీవితచరిత్ర కొంత నీకు వినిపింపక తప్పదు. అదివింటేనేగాని మాప్రసంగధోరణి నీకు బోధపడదు. దీపాలు పెట్టినారు కనుక మనకథ నిక కట్టిపెట్టుదము.

మఱునాడుదయమున కచ్చట జేరుటకు నిశ్చయించుకొని వారిర్వురు తమతమగృహముల కేగిరి.

౪

అనుకొన్న ప్రకారము మిత్రులిద్దఱు ప్రాతఃకాలముననే ఇసుకబయలిపద్దనున్న మామిడిచెట్టువద్ద చేరి సంభాషణ ప్రారంభించిరి.

"ఒకనాడు వితంతూద్వాహములను గూర్చి ఆమె తెలిపినభావములను పరిహసించుచు, 'నీకిట్టియకాలవైరాగ్య మెట్లు కలిగిన' దని నేను ప్రశ్నింపగా, అందుకు ప్రత్యుత్తరముగా మహాలక్ష్మి తనచరిత్ర నిట్లుచెప్ప నారంభించినది:—

'మా నాన్నగారి సంతానములో నేనే పెద్దదానిని. మాఅమ్మకు తర్వాత పుట్టిన ముగ్గురును మగపిల్లలే. నేనొక్కతెనే ఆడుపిల్లను కావడముచేత మాతలిదండ్రులకే గాక నాయనమ్మకు, మేనత్తకుగూడ నామీ దెంతో దయ. మాబాబయ్యగారికి భూములవల్ల చాలారాబడి వస్తుంది. మా నాయనమ్మయు, మేనత్తయుగూడ వేర్వేరుగా వడ్డీ వ్యాపారములుచేయుచు చాలాధనమును కూడబెట్టినారు. మా అమ్మ పుట్టింటివారు కూడ మిక్కిలి భాగ్యవంతులే. అందుచేత చిన్నప్పుడు ముద్దుముచ్చటలకు ఏమీ లోపము లేకుండ నేను చాలాగారాబముతో పెరిగేదానిని. నన్ను చిన్నప్పుడు మా యిరుగుపొరుగువారు "మహారాణీగారు" అను ముద్దుపేరుతో పిల్చేవారట. బాల్యవివాహము చేయుట మాబాబయ్యగారికి ఇష్టము లేదు. అయినను జమీందారీ సంబంధము, పోనీయవద్దని ఆడువాళ్లు పోరుకు తినడంచేతనే ఆయన నాకు ఎనిమిదవయేటనే వివాహం చేసినారు. మహా వైభవముతో జరిగిన నావివాహము నాకు బాగుగా జ్ఞాపకమున్నది. ఒంటినిండ వస్తువులు పెట్టుకొని, విలువైన బట్టలు కట్టుకొని అందముగా కనబడవలెననియు, మగనికంటె, ఎక్కువ తెలివిగలది అనిపించుకొనవలెననియు నా కప్పుడు కుతూహలంగా ఉండేది. పెండ్లి నాటికి నేను రెండవక్లాసు చదువుచు కృష్ణశతకము, సుమతిశతకము మొదలైన వానిలోని పద్యములు చదువుచుండే దాన్ని. నేను వీధిబడిలో చదువుకొనేటప్పుడు ఎంత పెంకితనంగా ఉంటే అంత గొప్పతనమని తలచి చాలా అల్లరి చేసే దానిని.

'మొగమునిండా పచ్చగాపసుపుపూసుకొని, ఎఱ్ఱని కుంకుమతో పెద్ద దయ్యముబొట్టు పెట్టుకొని, ఒంటినిండా నగలతో ఘల్లుఘల్లుమని చప్పుడయేలాగు ఎత్తియెత్తి అడుగులు వేయుచు మహాశక్తిలాగున ఉండవలెనని కళ్లెఱ్ఱచేసి యందరివైపు చూచుచు, మొగము త్రిప్పుకొనుచు బడాయిగా నడిచేదానిని.

'నాకూ నాభర్తకు నాలుగేండ్లకన్న యెక్కువ తేడా లేదు. విద్యావిషయమై గట్టిశ్రద్ధచేయవలసిన దని మాఅత్తవారు కబుర్లు పంపుటచేతను, మా అమ్మకుకూడ నన్ను విద్వాంసురాలిని చేయవలెనను సరదా ఉండడముచేతను నా కింటివద్ద ప్రత్యేకముగ చదువు చెప్పించుటకు

మావాళ్లు ప్రయత్నించినారు. కాని నా ధాటీకి ఆగలేక ఏడాదిలో ముగ్గురు ప్రయివేటు మాస్టర్లు చాలించుకొవలసి వచ్చినది. బడి చదువుకూడా మాని కొన్నాళ్లు ఇంటివద్దనే పాటలూ, పద్యాలు పాడుకొంటూ అల్లరి చేస్తూ ఉండేదాన్ని. ఇంతలో నా అదృష్టముకొలది స్వరాజ్య దీక్షితులైన మాగురువుగారు (రామ నారాయణ దీక్షితులను యువకుడు) వచ్చినారు. ఆయనది అసలు ఈయూరేనట. కాని సంస్కృతము, ఇంగ్లీషు,



"మొగము త్రిప్పుకొనుచు బడాయిగా నడిచేదానిని"

తెలుగు మొదలైనవి చదువుచు విద్యానురక్తుడై ఆయన చిన్నప్పటినుండియు విజయనగరములోనే నివసించుచుండేవారు. అవి సహాయనిరాకరణపురోజు లగుటచేత ఆయన అక్కడ చదువు మానివైచి, స్వరాజ్యదీక్ష పూని, రాజానగరం వచ్చి, ఈ చుట్టుపట్టుల గ్రామాదులలో ఖద్దరు ప్రచారము చేస్తూఉండేవారు. మాఅమ్మప్రోత్సాహము చేత మాబాబయ్యగారు ఆయనను పిలిపించి మాట్లాడి, నన్ను బుద్ధిమంతురాలినిగా నొనర్చుటే ముఖ్యమని చెప్పి, నెలకు ౭ రూ. జీతముమీద ఆయనను నాకు విద్యాగురువులుగా ఏర్పఱచినారు.

'ఆయన ప్రజ్ఞ యనుపమానము. నా పెంకితనము పోగొట్టుటకు ఆయన మంచి ప్రతిక్రియ కనిపెట్టినారు. "నీవు ఈలాగున నడుచుకొనుము. ఆలాగున కూడదు" అని ఆయన ఎప్పుడు నీతిబోధ చేయలేదు. ఒకరు చెప్పినట్లు నడుచుకొనుట పరువుతక్కువ యని భావించెడినేను తమ మాటకు తప్పక వ్యతిరిక్తముగా వర్తింతునని ఆయన మొదటనే బాగుగ గ్రహించినారు. అందుచేత నేనెట్లునడుచుకొనవలెనని ఆయన తలచిరో ఆప్రవర్తన నంతయు పురాణకథలలోని పతివ్రతలయెడల వర్తింపజేసి నూతన కల్పనలతో రసవంతములగు కథలు చెప్పుచుండేవారు. ఇతరులకంటె అధికురాలుగా నుండవలెనను నా అహంభావమే నా కాసమయమున మహోపకారియై ఆపతివ్రతలను మించవలెనను నుత్కంఠ కలిగించుచుండెడిది. "ఇస్సీ! చంద్రమతి, సావిత్రి మొదలగు వారివలె జగద్విఖ్యాతి పొందలేనిచో నాబ్రదుకెందు"కని అనేకమార్లు నేను భావోద్రేకమునకు వశమగుచుండేదానిని.

'ఆకథలు వినుటవలననే గట్టిగా అడుగులువేసి నడువకూడదనియు, పెద్దలవద్ద అణకువగా నుండవలెననియు, అధికప్రసంగములు చేయరాదనియు, సౌమ్యస్వరూపమును, సాధుభావమునుగల్గి ప్రజలచే నిగర్విణి యనిపించుకొనవలెననియు నాకు దృఢసంకల్పము గలిగినది. క్రమక్రమముగా నాప్రవర్తనమారిపోయి గురువుగారే దైవమని నమ్మి, ఆయనవద్ద భయభక్తులతోను, అత్యాసక్తితోను విద్యనేర్చుకొనుచుండేదానిని. తెలియక చేసినపాపమునకు ప్రాయశ్చిత్తమున్నది కాని తెలిసిచేసినదానికి లేదని గ్రహించినదాననగుటచే ఎంతలాభకరముగ కనబడినను అధర్మమగు పని చేయకుండుటకును, ఎన్నిఆటంకములైన దాటి ధర్మమగుపనిని తప్పక చేయుటకును నేను ప్రతిజ్ఞగైకొంటిని. నాకుగల్గిన అద్భుతమైన మార్పునకు మావాళ్లంతా ఎంతో సంతోషించుచున్న రోజులలోనే పిడుగువంటి నావైధవ్యవార్త వచ్చిపడినది. మా తలిదండ్రులు మున్నగువారి విచారములకు, ఏడ్పులకు పరిమితి లేదు. నాకు కొన్నాళ్ల వరకు చాలావిచారముగానే యుండేది.

'పదిహేనురోజులుమాత్రమే నాచదువున కొంటంకము కలిగినది. నిజముగా వైధవ్యదుఃఖము కన్న చదువు మాన్పింతురేమో యనుచింత నా కెక్కువగా ఉండేది. నా పట్టుదలచేతను, మా అమ్మ ప్రోత్సాహముచేతను మాబాబయ్యగారు నాకు ఇంకను రెండు మూడేండ్లు చదువు సాగించుటకు ఒప్పుకొన్నారు. యథాప్రకారము పాఠములు చెప్పుటకు వచ్చిన మా గురువుగారు మొదటి రోజున నాదుఃఖోపశమనార్థము వైరాగ్యవిషయములు ముచ్చటింప నారంభించినారు. నేనప్పు డెంత తెలివితక్కువపని చేసినా ననుకొన్నారు? "ఏమండీ పంతులుగారూ! భగవంతుడు సహజముగా కల్గించు ప్రతిపరిస్థితియు మానవుల మేలుకొఱకే యని మీరు చెప్పుచుందురు కదా! ఈ వైధవ్యము నామేలుకే యని మీరు నిర్ధారణచేయుదురా?" అంటిని. ఆయనకు కళ్ల వెంట నీళ్లు దొడదొడ కారినవి. కొంతసేపటికి కాని ఆయన తల యెత్తి మాట్లాడలేకపోయినారు. ఎరక్కపోయి ఆ మాట అన్నానని నాకు వెంటనే పశ్చాత్తాపము కలిగినది. కాని కొంచెముసేపటిలోనే ఆయన కన్నులు తుడుచుకొని మొగమెత్తి నావైపుచూచుచు, భగవంతుడు కల్గించు ప్రతికష్టమును కూడ వ్యక్తులకు తను శిక్షణ నొసంగి వారి మోక్షప్రాప్తి కెట్లు సులభసాధన మగుచున్నదో నాకు బాగుగ తెలియునట్లు రెండుమూడు కథలమూలమున నాకు బోధించినారు నాభావిజీవితమున కుపకరించు సద్విద్యను నేర్పి రెండుసంవత్సరములలో నన్ను కృతార్థురాలినిగా నొనర్చుట కాయన వాగ్దానమొనర్చి విశేషాభిమానముతో నాకు పాఠములు చెప్పుచుండెడి వారు.

'ఆంధ్రభాషలోని మంచిపుస్తకము లెన్నో మా వాళ్లచే కొనిపించి సాదరముగా నవియన్నియు చదివించి విషయములను సవిమర్శనంబుగ బోధించుచుండేవారు. ఆర్యచరిత్రములు, హితచర్యలు, కృష్ణావతారతత్త్వము, శ్రీకృష్ణలీలామృతము మున్నగు పుస్తకముల మూలమున మాగురువుగారు నాకనేక మంచివిషయములుబోధించుచుండేవారు. గ్రంథకర్తయగు బ్రహ్మశ్రీ వావిలకొలను సుబ్బారావు పంతులుగారు సనాతన మతోద్ధారణమునకై యవతరించినభగవదవతారమూర్తియే యని వర్ణించి చెప్పుచు, ఆ యాంధ్ర వాల్మీకిగారి యందు నా కమితభక్తిభావము కుదురునట్లు చేసినారు. బమ్మెరపోతనామాత్యుడు, తులసీదాసు, లీలాశుకుడు మొదలగు భక్తితత్పరుల చరిత్రములు వివరించి ఆయన నాహృదయమున నిరాడంబరజీవనాపేక్షయు, భగవద్భక్తియు నెలకొనజేసిరి. దేశచరిత్రయందలి ప్రధానవిషయములు కొన్ని చెప్పి నాకు దేశభక్తి యంకురించునట్లు చేసినారు. నేనీ విద్యాభ్యాసంగములో మునిగి వైధవ్యవిచారము పూర్తిగా మఱచిపోతిని గాని, మాఅమ్మ అప్పటినుండియు మంచముపట్టి ఏడాదిలో చనిపోయెను. ఆమె పోయిన తర్వాత ఎంత కుదురుపర్చుకొన యత్నించినను మనస్సు తిన్నగా నుండక బెంగచే పది పండ్రెండు రోజులవరకును పిచ్చిపట్టిన ట్లయ్యెను.

'మాఅమ్మకు జబ్బుగనున్న దినములలోనే మీరు ఒకసారివచ్చిఊళ్లో రెండురోజులుండి మాయింట్లోఒక్కపూట మాత్రము భోజనము చేసి వెళ్లిపోయినారు. ఆరెండు రోజులలోనే మీరు ప్రతాపరుద్రచక్రవర్తి, శివాజీమహారాజు మొదలగువీరుల చరిత్రములును, దుర్గావతి, రాణి సంయుక్త, మీరాబాయి, ఝాన్సీ లక్ష్మీబాయి మొదలగు మహిళామణుల వీరకృత్యములును, సిపాయికలహము యొక్క నిజస్థితినిదెలియబర్చి నాహృదయమున స్వరాజ్యవాంఛ దృఢముగ పాదుకొనునట్లు చేసినారు. తరువాత నేను మాగురువుగారి నడిగి బ్రిటిష్‌వర్తకు లీదేశమున ప్రవేశించుట, మనరాజ్యము బ్రిటిష్‌వారి పాలగుట మొదలగు చరిత్రాంశములను, శ్రీగాంధీమహాత్ముని యసహాయోద్యమచరిత్రమును పూర్తిగా తెలిసికొంటిని.

'మీరు మరల ఈగ్రామము వచ్చినప్పుడు మాబలవంతముచే రోజున్నరమాత్ర మున్నారు. అప్పుడు చాలవరకు భగవంతుడు, కర్మ, మనుష్యప్రయత్నము మొదలగు విషయములను గురించి నేనడిగినప్రశ్నలకెల్ల మీరు మనస్సంతుష్టియగు జవాబు లిచ్చినారు. అప్పుడు మీయందు నాకెంతో పూజ్యభావము కల్గినది. ఇంకా అనేకసందేహములు మిమ్ముల నడిగి తీర్చుకొనవలె నని తలచినాను. కాని సందర్భపడలేదు.

'సాంఘికపరిస్థితులు, సంస్కరణములు మున్నగు విషయములనుగూర్చి బోధించుడని నేను మాగురువుగారిని కోరగా ఆయన శ్రీ కందుకూరి వీరేశలింగంపంతులుగారి ౧౨ పెద్దసంపుటములును కొని తెప్పించి అన్నియు చదివించి, యందుముఖ్యముగా వితంతూద్వాహములనుగూర్చిన ఉపన్యాసములును, ప్రహసనములును సమవిమర్శనముగ బోధించినారు. మఱియును బాలవితంతూద్వాహములు కావలెనని వ్రాసిన సంఘసంస్కర్తల వ్రాతలును, కూడదని వ్రాసిన సనాతనమతకర్తల వ్రాతలును నాచే చదివించి యందలి మంచిచెడ్డలను విమర్శించి చెప్పినారు. వితంతూద్వాహములను గూర్చి మీయభిప్రాయ మేమని నేను ఆయనను ప్రశ్నించితిని. ఆయన యిట్లు చెప్పిరి: "నేను ఈవిషయమును గూర్చి ఇంకా ఒక స్థిరమైన యుద్దేశమునకు రాలేకపోవుచున్నాను. అయినను నా యుద్దేశ్యముతో నీకేమి పనియున్నది? భగవంతుఁడు నీకు వేరే మెదడిచ్చియున్నాడు. దానినిచక్కగ వినియోగించుము. నీవు చదివిన అన్నిపుస్తకములలోని సారాంశమునుబట్టి ఆలోచించి ఏది ధర్మమని నీబుద్ధికి తోచునో అట్లే నీవు నిర్ణయించుకొమ్ము" అని చెప్పినారు.

'నాకు పునర్వివాహేచ్ఛ యెంతమాత్రము లేనందునను, ముక్తిసాధనమగు విద్యను గ్రహించుటయందే యాసక్తి గలుగుటచేతను రజస్వలయైన రెండేండ్లపిమ్మట మావాళ్లకిష్టము లేకున్నను బలవంతముమీద వారిని ఒప్పించి నేను తలవెండ్రుకలు తీయించివైచికొని వైరాగ్యదీక్షతో సద్గ్రంథపఠనము గావించుచు కాలక్షేపము చేయ మొదలిడితిని.

'మాతండ్రిగారు భాగ్యవంతు లగుటచే చాలమంది తమపిల్లల నిత్తుమని వచ్చుచున్నందున మొదట కొంచెము సంశయించియు, మా నాయనమ్మ కూడ చేసికొమ్మని చెప్పిన మీదట ఆయన ఒక పెద్దపిల్లను వివాహమాడినారు. అమె నాలుగు మాసములకే పెద్దమనిషి యగుటచే వెంటనే కార్యముచేసికొని ఆయన మాతమ్ముల చదువులకోసము పెద్దాపురములో మకాంపెట్టినారు. మాగురువుగారు కూడ దేశసేవాతత్పరుడై స్థలాంతరము పోవలసి వచ్చుటచే నేను స్వయంకృషివలననే విద్యాభివృద్ధి చేసికొనుచుంటిని.' అని ఆమె తన కడచిన జీవితచరిత్రను వినిపించెను."

అప్పటికే చాల ప్రొద్దెక్కిపోవుటచే సంభాషణముచాలించి సాయంత్రము నాలుగుగంటలకేయచ్చోటు చేరునట్లు బయలుదేరు నేర్పాటుమీద నా మిత్రులిర్వురు నిజగృహంబుల కరిగిరి.

౭

నాటి సాయంకాలమున మిత్రులిర్వురు మామూలు చోటుకు వచ్చి కూర్చుండుటచే మరల ప్రసంగము ప్రారంభమయ్యెను.

కృష్ణా——మీ యిరువురకును జరిగిన యనవసర ప్రసంగములన్నియు నిప్పుడు విప్పక కేవల మామెను పునర్వివాహమున కొప్పించుటకు యత్నించుపట్ల మీ రొనర్చిన సంభాషణము మాత్రమే వివరముగ చెప్పుము.

శాస్త్రి——అదే చెప్పెదను. ఇంద్రియసుఖములపై పూర్తిగ విరక్తి గల్గించుకొనిననే గాని భగవంతునియందు నిశ్చలభక్తి కుదురదనియు, అట్టిభక్తి లేని వారెట్టి ప్రజ్ఞావంతులైనను మోక్షము నందజాలరనియు ఆమె ప్రస్తావవశముగా చెప్పిన మీదట మా కీ క్రింది సంభాషణ జరిగినది:——

నేను——భగవద్గీతలో శ్రీకృష్ణు డర్జునునకు బోధించిన కర్మసిద్ధాంతమును నీవు పూర్తిగా గ్రహించినావా?

మహా——నీధర్మమును నీవు ఫలాపేక్ష లేకుండ నిర్వర్తింపు మనునదియే భగవద్గీతయందలి సారమని నేను గ్రహించినాను.

నేను——యౌవనస్త్రీవగు నీధర్మ మేమని నీవు నిర్ణయించు కొన్నావు?

మహా——హిందూమతాచారము చొప్పున వైధవ్యధర్మములను పిసమైన లోపము లేకుండ నిర్వర్తించుటే నా పరమధర్మమని నేను విశ్వసించుచున్నాను.

నేను——వైధవ్య మనుభవించుటకే భగవంతుడు నిన్ను పుట్టించెననియా నీయుద్దేశ్యము?

మహా—నిశ్చయముగా అందుకొరకనియే.

నేను—దాంపత్యసుఖము మాట యట్లుంచుము. హాయిగా జుట్టు పెంచి తలదువ్వుకొని, పువ్వులుముడుచుకొని, చక్కని క్రొత్తబట్టలు కట్టుకొని, మువ్వల ఒడ్డాణము, గాజులు మొదలైనవి ఘల్లుఘల్లురనగా కొన్నాళ్లయిన సుఖముగా తిరుగవలెనని ఉబలాటము నీకేల లేదు? పోనీ! ఒక్కమారు నీ వట్టివేషము వేసి నాకు చూపించి నాకనుల కృతార్థత నందింపుము. నిన్ను బ్రతిమాలుచున్నాను. నూరేండ్లుబ్రతికెదవు నీబ్రతుకుకంతయు వైధవ్యదుఃఖముచే గృశింపజేయుట యధర్మమని నీకు తోచుట లేదా? మోకాళ్ల వరకు జారెడు బారెడేసికురులతోను, పసుపు కుంకుమలతో మంగళప్రదమై విలసిల్లు ముద్దుమొగముతోను, లక్ష్మీకళను వెదజల్లు వెలగల నగలతోను, బంగరుబొమ్మవలె మెలగుచు గృహమును పావనముచేయజాలు నీవు అంగవైకల్యము కలుగునట్లు ముండనము చేయించుకొని మూలమూలల నక్కుట మూఢాచార పిశాచభయమున నే కదా!

మహా—ఆహా! మీవంటి దేశభక్తులు కూడ పామరులవలె నిట్టి వినరానిమాటలాడుదురని నేను కలనైన తలపలేదు. ఈపసుపులు, కుంకుమలు, నగలు, వెంట్రుకలు మొదలగునవి సౌఖ్యముగూర్చునని యడియాసలుపడి, యెండమావులవెంట పరువులెత్తి ప్రాణములబాయు మృగములచందముననూ, పండని భ్రమించి దీపపుమంటను బడి చచ్చు మిడుతలపురుగులరీతిగను, ఎన్నికోట్లసారులు పుట్టి, చచ్చి, విసిగి, వేసారి, తుదకీపవిత్రమగు బ్రాహ్మణపుట్టువు పుట్టితినో! ఆమిథ్యాసుఖంబులకై యాసపడి నే నింకను మోక్షదూరురాల నగుదునా? నేను నాగమ్యస్థానమగు మోక్షమును బ్రాపించుటకు చేయుచుండిన కోట్లకొలది సంవత్సరములుగల ఈమహాదీర్ఘయాత్రలో ఒకనూరుసంవత్సరము లనునది చాల స్వల్పకాలమే. భగవంతుడు నాకు శిక్షణ కేర్పఱిచిన యీ వైధవ్యధర్మమును దీక్షగా ఆచరించినయెడల నాకు ముక్తివచ్చునను టకు పీసమేనియు సందియములేదు. తప్పక మోక్షము కల్గునను ధైర్యముండగా ఇంతకన్న వేయిమడుంగులు కఠినతర నియమములు గూడ బూని సంతోషముతో యావజ్జీవమును వైధవ్యధర్మ మాచరించుటకైన నే నేల వెనుకాడుదును?

నేను—చిన్నప్పుడు బొట్టు, నగలు మొదలైన వానియందు అపరిమితప్రేమ చూపెడి దానవుగదా? ఇప్పుడు నీ వాప్రేమబంధమును పూర్తిగా త్రెంచుకొనగ్గలిగితివా?

మహా—ఆ, సంపూర్తిగా త్రెంచుకొన్నాను. ఇట్టి పిచ్చిశృంగారవేషములవలన సుఖము గల్గునని భ్రమపడి ఇంతకు పూర్వ మెన్నివేలజన్మములందో మోయలేని నగలతో గంగిరెద్దువలె తిరిగియేయుంటును. అయినను నేను వానియందు సుఖము లేదని తెలుసుకోలేనందున, భగవంతుడు చిన్నప్పుడు నాకు కరవుతీర పసుపు, కుంకుమ, నగలు, బట్టలు మొదలైనవి కొల్లలుగ నిచ్చి కొన్నాళ్లు గర్వముచే మైమరచునట్లు చేసి, హఠాత్తుగా అవి లాగివైచినాడు. భగవంతుడు దయతో నాకు ప్రాప్తింపజేసిన సద్విద్యచే నా అజ్ఞానాంధకారమంతయు పటాపంచలైనందున ఆదయామయుడు గూర్చిన యీసంఘటనలెల్ల సంసారసుఖములపై పూర్తిగ విరక్తి గల్గించి నన్ను తరింపజేయుటకే గదా యని నే నిప్పుడు గ్రహించితిని.

నేను—నీవంటి సౌందర్యరాశి వైధవ్య మనుభవింపవలెనని దేవు డెప్పుడును ఉద్దేశింపలేదు. నీవే లేనిపోనిశంకలు కల్పించుకొని అజ్ఞానకృత్యమును దైవకార్యమని భ్రమించుచున్నావు. నీవు సంతానవతివై సుఖింపవలెననియే భగవంతుని యుద్దేశ్యము. కావుననే తదనుకూలమగు సర్వాంగసౌష్ఠవ మాతడు నీకు దయచేసినాడు. అట్లుగాక నీవు తప్పక విరాగిణివై వంధ్యజీవనము గడుపవలెనని తలచుచో ఆసర్వశక్తిమంతుడు నిన్నేల నపుంసకమూర్తిగా సృష్టింపకుండును?

మహా—మీరీప్రశ్నను పవిత్రభావముతో నడుగుచున్నారని నేను భావించినందున నిజము చెప్పుచున్నాను. భగవంతుడు నాకు సర్వాంగసౌందర్యము నిచ్చి వైధవ్యము విధించుట నాకు తగినశిక్షణ నొసంగుటకే

నపుంసకుడు వైరాగ్య మవలంబించుటలో ఇంద్రియజయ మేమియు లేదు. నావంటివారి వైధవ్యబ్రహ్మచర్యయే మోక్షప్రాప్తికి తగిన సుశిక్షణ మొనగూర్పజాలును.

నేను—మీతండ్రిగారు నీకు నయమున భయమున నచ్చజెప్పి పునర్వివాహము చేయుదురనుకో; నీవు చక్కగా మరల తలపెందుకొని, పసుపు కుంకుమలుగల చక్కని ముఖముతో సార్థకముగా మహాలక్ష్మివై, మంచి సంతానమును కని, పతివ్రతామణివై, సుఖముగా కాలక్షేపము చేతువనుకో; అప్పుడు నిన్ను భగవంతుడేల శిక్షించును? జర్మనీ, ఇంగ్లండు, జపాను మొదలగు దేశములలో స్త్రీలు పునర్వివాహములు చేసికొందురు గదా. వారు దైవశిక్షణమునకు బాత్రులనియే నీయుద్దేశ్యమా ?

మహా—మోక్షదూరలగుటయే వారికి శిక్ష. కాని కర్మభూమి యగు మనభరతఖండమున నున్నతజాతు లగు బ్రాహ్మణాదివంశముల స్త్రీలు పునర్వివాహము చేసికొన్నచో తప్పక అధఃపతిత లగుదురు. నే నింకను ఇంద్రియలోలనై వివాహములమీదవివాహములు చేసికొననువ్విళ్లూరుచుండినచో, మన దేశమందలి చాకలి, మంగలి మొదలగు నిమ్నజాతులలోనో, లేక ఏపాశ్చాత్య దేశములలోనో పుట్టియుందును కాని పావనమగు బ్రాహ్మణ కులమున పుట్టియుండను. అమెరికావంటి దేశములో కోటీశ్వరుని భార్యనైయుండి, మహావైభవములు పొందుచు వేయిసంవత్సరములు జీవించి వత్తువా యని భగవంతుడు నన్నడిగినచో, నాగమ్యస్థాన మగు మోక్షమార్గమున కది యాతంకప్రద మగుటచే నందులకు నే నెంతమాత్ర మంగీకరింపను. నిజమైన భారతదేశభక్తుడు మన దేశపు బానిసతనమును బోగొట్టి స్వాతంత్ర్య సంపాదనము సేయుట కెంతతొందర పడుచుండునో కర్మబంధములు త్రెంపుకొని మోక్షప్రాప్తి చెందుటకు నాప్రాణి యంతకన్న నెన్నోరెట్లధికముగ తొందరపడుచున్నదని చెప్పినచో నామోక్షవాంఛ మీకర్థమగు నేమో! మోక్షసౌఖ్యము ముందర ఈప్రపంచసౌఖ్యములన్నియు సూర్యబింబము ముందరి మిణుగురు పురుగుల వంటివని నానమ్మకము.

నేను—మాటలకేమి? ఇంతకన్న నెక్కువే చెప్పవచ్చును. కాని పరాశరునివంటి మహామునిపుంగవులే కామమును జయింపలేనప్పుడు సామాన్యమానవులు కామమును జయింతురనుట అసంభవము. అందులోను యౌవనవతియగు నీవంటిస్త్రీ యావజ్జీవము బ్రహ్మచర్య వ్రత మవలంబించి యుండగలనని చెప్పుట హాస్యాస్పదమని నాయుద్దేశ్యము. నే నిట్లు అనరానిమాట లాడుచున్నానని కోపము వహింపక దైవముఖము చూచి నిజము చెప్పుము: నీభర్తృమరణానంతరమునుండి యిప్పటివరకొక్కసారియైన నీహృదయము కామవాంఛచే కలుషితముకా లేదా?

మహా—మానవుని హృదయము చంచలమైనదే. అందుకు సందేహము లేదు. నాహృదయ మొకటిరెండుసారులు విషయసుఖములను గూర్చిన యోచనచే నించుక చలించినను నేను వెనువెంటనే పశ్చాత్తాపముచే మనఃపారిశుద్ధ్యమును జెందితిననియు, భగవత్కటాక్షమువలన నాబ్రహ్మచర్యదీక్ష కింతవర కెట్టిలోపమును కలుగలేదనియు నేను ప్రమాణముచేసి చెప్పుచున్నాను. ఇంక ముందు నాజీవితములో నెప్పుడు గూడ నాహృదయమును సైతము, పొరబాటుననైన, కామవాంఛచే కలుషితము గానీయకుండ, పరమపవిత్రముగ నుంచుకొనగల్గుటకు నే ననుదినమును త్రికరణశుద్ధిగా దైవమును ప్రార్థించుచున్నానని కూడ ప్రమాణముగా నేను చెప్పగలను.

నేను—వద్దు, వద్దు. నీవట్టిప్రార్థనలును, ప్రమాణములును ఇక కట్టిపెట్టి, నాహితోక్తులు శ్రద్ధగావిని తదనుసారము వర్తింపుము. నీవు శుభపరంపరలచే వర్థిల్లుదువు. నీహృదయ మొకటిరెండుసారులు కామవాంఛాకలితమైనదని యొప్పుకొనుచున్నావు గదా. ఎవ్వానిని జూచినప్పుడు నీడెందమున కామవాంఛ యంకురించినదో యాపురుషుని నేను నాయావచ్ఛక్తిని వినియోగించి వెదకి తెచ్చి నీకు సమకూర్తును. నీవాతని వివాహమాడి భగవంతుడు నీకునయచేసిన సర్వాంగసౌందర్యమును సార్థకపరుచుకొని సుఖించుము. ఇందువలన నీపాతివ్ర

త్యమున కెంతమాత్రము భంగము వాటిల్లదు. నీమోక్షమార్గమున కెట్టియాటంకమును గలుగదు. అందుకు నేనెట్టి ప్రూచీకత్తునైన వ్రాసియీయగలను.

"నేను ఈమాటలనగానే మహాలక్ష్మి నాపై తేరి పారచూచినది. ఆగంభీరాకారము చూడగానే ఆమెకు చాల కోపమువచ్చియుండునని నేననుకొంటిని."

నేను—నీకు కోపమువద్దు. నన్ను నీ గురుతుల్యునిగ భావించితివి గనుక నాకు హితమని తోచినవిషయములు నీతో చెప్పుచున్నాను. నా కిప్పుడు నిష్కపటముగ జవాబిమ్మనియే నిన్ను నేను మఱిమఱి బ్రతిమాలుచున్నాను.

మహా—(లజ్జితయై మొగము వంచుకొని) మీరు కేవలము గురుతుల్యులే కారు. దైవతుల్యులే. మీ రాడిన మాటలవలన నా కెంతమాత్రము కోపములేదు. నన్ను అంతరిక్షమార్గమున కెక్కించుటకును, అధఃపాతాళమున కణచివేయుటకును గూడ తగినసామర్థ్యము మీకు కలదని నేను భావించుచున్నాను. నాయందు దయవహించుడు. నామోక్షమార్గమగు వైధవ్యధర్మచర్య కడ్డువచ్చి నన్ను భ్రంగదీయకుడు. సామోపాయమున నెన్నిదినములు చెప్పినను బుద్ధిరాని శిష్యునకు దండోపాయమున రెండునిమిషములలో బుద్ధి తెప్పింపజూచు గురువర్యునివలె నాకనేకవేలజన్మము లెత్తినను రాని వైరాగ్యదీక్షను భగవంతుడు వైధవ్యశిక్షణోపాయమున రప్పింప దలపెట్టినాడు. ఈ ఉపాయముకూడ వృథయై నేను తుచ్ఛజీవనమునకు దిగినయెడల మరల ఎన్నికోట్లజన్మము లెత్తిననోగాని నా కిట్టి మంచియవకాశము రాదని నాహృదయము చెప్పుచున్నది.

నేను—(చిఱునవ్వుతో) నీహృదయమును నీకన్న ఎక్కువ బాగుగా నేను కృషి సల్పి తెలిసికొన్నాను. వెనుక నీతో నేను రెండవసారి మాట్లాడుచున్నప్పుడు రెండుపర్యాయములు నావైపు నీవు మోహదృష్టితో చూచితివి. అప్పుడు నేను గొప్ప స్వరాజ్యదీక్షలో నుండి దేశముకొరకు ప్రాణ మర్పించివేయవలెనను పట్టుదలతో నుండుటచే చలింపలేదు కాని, లేనియెడల నేను నాయావచ్ఛక్తినుపయోగించి నిన్ను పెండ్లాడితీరియుందును. ఇట్లు మాట్లాడుచుంటినని నేను ఇంద్రియలోలుడనగు దుర్మార్గుడనని తలపకుము. దైవసాక్షిగా చెప్పుచున్నాను: నిన్నుతప్ప నాకంటబడిన స్త్రీలోకమంతటిని నే నింతవరకు మాతృసమానముగనే చూచుచున్నాను. నీయందైనను కేవలము కామవాంఛ తీర్చుకొనవలెనను తుచ్ఛపుదలంపు నాకు కలనైనను లేదు. నీ వేనాడు నావైపు మోహదృష్టులు ప్రసరింపజేసితివో నాడే నీ వైధవ్యదశ చూచి నాహృదయము కరగిపోయినది. నేను మఱి వేయిజన్మము లెక్కువ యెత్తవలసి వచ్చునంతటి మోక్షదూరుడనైపోయినను సరే, నిన్ను నాసహధర్మచారిణిగా గైకొనుట నాధర్మమని నేనప్పుడు నిశ్చయించుకొన్నాను.

మహా—నేను మీయెడల ఘోరమగు నేరము చేసితిని. నాపొరపాటునకు వెంటనేపశ్చాత్తాపముకూడ పొందితిని. మీ నిర్మలవైరాగ్యదీక్ష కప్పుడు భంగము వాటిల్లజేసిన ఈదీనురాలి యవజ్ఞతను మన్నించి యది మరచిపొండని మిమ్మిదే నమస్కారపురస్సరముగ వినయముతో ప్రార్థించుచున్నాను.

నేను—నీనమస్కారములును, ప్రార్థనలును నాకక్కరలేదు. నీకు సంతానవాంఛ లేనియెడల నన్ను వివాహమాడి బ్రహ్మచర్యవ్రతమే యవలంబించి యుండుము. నేనును యావజ్జీవము బ్రహ్మచర్యమే యవలంబించి నీదీక్ష కెట్టియాటంకము గల్గింపకయుందునని యిదే ప్రమాణము చేయుచున్నాను.

"ఈమాటలు చెప్పగానే మహాలక్ష్మి తనకన్నుల వెంట ధోడధోడ కారుచున్న కన్నీళ్లను పైటచెరగుతో ఒత్తుకొని మొగము పైకెత్తి ప్రసన్నవదనముతో నావైపు చూచుచు ఇట్లనెను: 'పూర్వజన్మమున మనమిద్దరము దంపతులమని నామనోదర్పణమున నిప్పుడు ప్రత్యక్షముగ గోచరించుచున్నది. ఒకరినొకరము మోసపుచ్చుకొని చెడువర్తనులమగుటచేత నేను వితంతువుగను,మీరు బ్రహ్మచారిగను ఉండునట్లు మనకు భగవంతుడు శిక్ష విధించియున్నాడు. మనల నతిసులభముగ గట్టెక్కింప దలచి

విధించినయీభగవదాజ్ఞను మనమతిక్రమించి వివాహితుల మైతిమా, మనముభయులమును అగ్రపతితుల మైపోవుదుము మీరుచెప్పినట్లు పెండ్లాడి బ్రహ్మచర్యవ్రతము నవలంబించి యుండరాదా యనిన, దానిచే లోకమునకు తప్పు పాఠము చెప్పి పాపమున బడిపోవుదుము."

సంభాషణ మింతవఱకు కగునప్పటికి చాల రాత్రి యైపోవుటచే ఆమిత్రులిర్వురును కథ ఆపివైచి యిండ్లకు బోయిరి.

౬

మఱునాటి ప్రాతఃకాలమున మామిడిమ్రానునీడను గూర్చుండి యాబాల్యమిత్రులు సంభాషణ నుపక్రమించిరి.

"మా పూర్వజన్మదాంపత్యవార్త విన్న తర్వాత కొంతసేపటివరకు నే నేమియు మాట్లాడ లేకపోతిని. పిమ్మట మనస్సు కుదురుపర్చుకొని యిట్లంటిని:

నేను—సరే, మన దాంపత్యముమాట యట్లుంచుము. మనభారతదేశమున నీవంటిపవిత్రురాలగు వితంతు స్త్రీ కోటికొక్కతె యైన నుండదేమో అని నాసందేహము. అందులోను కేవలము బాలవితంతువు లగు వారు ఈడువచ్చినవెనుక మనస్సునునిలుపుకొనజాలరనుట నిస్సందేహము. అట్టి వారికి పునర్వివాహము లవసరము కాదా?

మహా—ఈవిషయమున మీరు చాల పొరబడు చున్నారు. వైధవ్యధర్మచర్యము బాగుగ నుగ్గించి కట్టు బాటులోనున్న బాలవితంతువెప్పటికిని తనబ్రహ్మచర్యమునకు ఆటంకము కల్గించుకొనదు. మీరు స్వరాజ్య దీక్షయం దుండుటచేతనే కదా, నాపాపిష్టి కన్నుల యెదుట మీ రానాడు చలింపకుండ నిలువగల్గితిరి. అట్లే వైధవ్యచర్యా దీక్ష, స్త్రీస్వాభావికమగు లజ్జ, పతితుల మగుదుమను భయము, పెద్దలకట్టుబాటు మొదలగున వన్నియు జేరి కవచమువలె మనభారతదేశమందలి వితంతుస్త్రీల పావనత్వమును కాపాడుచున్నవి. అట్టి పావనమతులగు స్త్రీలు కోటికొక్కరు కాదు—నూటి కిద్దరు ముగ్గురు కన్న నెక్కువగ నుందురనియే నేను పందెము పెట్టి చెప్పగలను.

నేను—మిగిలిన నూటికి తొంబదియెనమండుగురు చొప్పున గల వితంతుస్త్రీలగతి యేమి? వారు పతితలై పోవలసినదేనా?

మహా—మీమాట బహుబాగున్నది. లోకమున నిత్యసత్యవ్రతదీక్ష గలవా రెందరున్నారు? కోటికొక్కరైన నున్నారని మీరు ప్రతిజ్ఞపట్టి చెప్పగలరా? సత్యవ్రతమవలంబించుటదుస్సాధ్యమని, బుద్ధమాడిన దోషము లేదని యెవ్వరైన బోధింతురా? అట్టి బోధకుల పనిని ఎవరు మెచ్చెదరు? బ్రహ్మచర్యముకూడ సరిగా అట్టిదే. సామాన్యుల కది దుస్సాధ్యము. దానిని జేరుటకును మనుజులు తమ శక్త్యనుసారమే యత్నించుచున్నారు. కర్మభూమియగు మన పవిత్రభారతవర్షమున మహానుభావులగు ఋషులు మనుష్యుల స్వభావముల కనుగుణముగ ఆయాజాతుల నేర్పాటుచేసి, యున్నతజాతులకు కఠిన నియమములను, నిమ్నజాతులకు సులభనియమములను పెట్టియున్నారు. మన దేశములో వితంతూద్వాహమున కంగీకరించు కులము లెన్నియో యున్నవి.

నేను—అయితే నీయుద్దేశప్రకారము ఏదేశమందెక్కువ నిర్బంధవైధవ్య మున్నదో యాదేశమే పవిత్రతరమైన దన్నమాట.

మహా—అట్లుకాదు. వైధవ్యశిక్ష ననుభవింపవలసిన స్త్రీలు లేకుండ ఏదేశమున సతీపతులు చిరాయుష్మంతులై నిష్కల్మషహృదయముతో సత్వరమోక్షప్రాప్తికి బయత్నములు చేయుదురో అదే ధన్యదేశము. భగవంతుడు వైధవ్యము గలిగించినను దాని ననుభవింపమని భగవదాజ్ఞను అతిక్రమింప యత్నించువారు మేము దెబ్బలు తినమని యుపాధ్యాయు నెదిరించి పాఠములు చదువక తిరుగు కొంటె పిల్లలవంటివారని నాయుద్దేశము.

నేను—సరే. ఈ వివాదాంశ మట్లుంచుము. ప్రస్తుతకాలమున ద్విజులలోని వితంతుస్త్రీలందరునిర్బంధ వైధవ్యమువలన నానాబాధలు పొందుచు కొందఱు దుర్నీతి ప్రవర్తనలై చెడిపోవుచుండుట కన్నులార చూచు సంఘసంస్కర్తలీనిర్బంధమును వీలైనంతవరకు తగ్గించు

టకు ప్రయత్నించుచున్నారు. వారు మంచి యుద్దేశ్యముతో ఆపని చేయుచున్నారు గనుక భగవంతునిదృష్టిలో వారు అనింద్యవర్తను లనియే నానమ్మకము. నీవు దీని కంగీకరింతువా ?

మహా—నా అంగీకారము జోలి మీ కెందుకు? మీ రట్లు విశ్వసించుట తప్పని నేను మీతో వాదింపను.

నేను—తప్పైనచో వాదించి నన్ను ఒప్పింపుమనియే నిన్ను నే నడుగుచున్నాను. రహస్యముగ విటులతో వర్తింప నెంచు వితంతువుకన్న బహిరంగముగ బునర్వివాహము చేసికొని యొక్కభర్తతో నిర్భయముగ గాపురముచేయు యువతి యుత్తమురాలని నీవు ఒప్పుకొందువా?

మహా—రహస్యముగ వ్యభిచరించుచు పైకి విరాగిణివలె వర్తించువితంతువు తానే పతితురా లగుచున్నది కాని, కులమును పతిత మొనర్చుట లేదనియు, బహిరంగముగ పునర్వివాహ మొనర్చుకొను స్త్రీ కులమున కంతకును పతనము గూర్చుటవలన నెక్కువ నేర మొనర్చిన దగుచున్నదనియు గొందఱు పూజ్యులగు పెద్ద లభిప్రాయమిచ్చియున్నారు. కాని నాహృదయమునకు మఱియొక రీతిగా గోచరించినది. కులములో నుండి రహస్యముగ విటులతో దిరుగు వితంతువు పాపమునకు మేర లేదనియు, బహిరంగముగ పునర్వివాహముచేసికొని కులభ్రష్టయిపోవు యువతి యున్నతకులమందలి కట్టుబాటులప్రకారము వర్తింపజాలని తన యసమర్థతను బహిరంగముగ ఒప్పుకొని నిమ్నజాతికి దిగి మోక్షదూరురా లైనను పాపురాలు మాత్రము కాదనియు నానమ్మకము.

నేను—(సంతోషముతో) అవును. చక్కగా చెప్పితివి. దీనిని బట్టి ఒకరీతిగా నీవు పునర్వివాహముల కంగీకరించినట్లే.

మహా—పునర్వివాహములు చేసికొన్న స్త్రీలు కులములో నుండగోరుట మాత్రము కూడదు. అట్టి వారందరుశూద్రజాతిలోని ఒకఅంతర్భాగముగ నెన్నబడుచు మనహిందూమతములోనే యుంచబడుట కెవ్వరు నభ్యంతరపెట్టరని నాయుద్దేశ్యము.

నేను—అట్టి వారిని తల్లి, తండ్రి మొదలగువారికి వెలియై పొమ్మనుట క్రూరము కాదా?

మహా—ఉత్తమకులమునకు విధింపబడిన నియమములు నిర్వహింపలేక పతనమున కంగీకరించినవారు పవిత్రులగు తలిదండ్రులతో నెట్లు కలిసియుందురు?

నేను—దుర్నీతిపరు లగువారు రహస్యముగ వ్యభిచరించుచు బహిష్కరింపబడకుండ కులములో లేరా? అట్టివారికన్న బహిరంగవర్తనలు శ్రేష్ఠురాండ్రని మన మొప్పుకొనవలెను గదా!

మహా—కులములోనుండియు చెడ్డపనులు చేయుచున్నవారు గనుక నేవారికి పాపము కల్గును. కులమునుండి బహిష్కరింపబడుటకు వీలగునట్లు మారుమనువు కోడబడి నిమ్నజాతుల నియమమును జేకొందుమని బహిరంగముగ నొప్పుకొనువారికి పాప ముండదు. ఇంతకును సద్విద్యావ్యాప్తి గల్గించి జనులను కులధర్మములందు వర్తింపజేయువారే ఘనులుగాని కులనియమములు కఠినములనిపగచుచు వాని నుల్లంఘింపుడని ప్రజలకు బోధించువారు లోకోపకారులు కారు. వారు పరమదయాళు లే యైనను లోకులకు వారివలన నష్టమే కాని లాభము వీసమంతయు లేదని నానిశ్చయము.

నేను—సద్విద్యవలన బాలవితంతువులకు కామము నశించునని నీకు విశ్వాసమున్నదా?

మహా—భక్తిజ్ఞాన వైరాగ్యములు గల్గించు విద్యవలన తప్పక కామవాంఛ నశించితీరును. ఏపనినిజేయుటకైన అహంభావయుతమగు మానవశక్తికి సామర్థ్యము లేదు. ఎవ్వరు అమూల్యమగు దైవశక్తి తమయందు నిరంతరము నెలకొని యుండునట్లు భక్తితత్పరులై పవిత్రజీవితమునకు గడంగుదురో వారికి కామము తప్పక నశించును.

నేను—అది వట్టిమాట–కామమును జయింప మునిపుంగవులకే అసాధ్యమైనది. సామాన్యస్త్రీ దానిని జయింపలేదు.

మహా—అవును, సామాన్యస్త్రీ జయింపలేదు. కాని ఉత్తమజాతిస్త్రీ తప్పక జయింపగలదు. దాని

కేమిగాని, మునీంద్రులకే అసాధ్యమగు బ్రహ్మచర్యమును మీ రెట్లు యావజ్జీవమును గడపగలమని యాశించు చున్నారు?

నేను—(చిరునవ్వుతో) నాభార్య అజ్ఞానురాలై లేని వైధవ్యమును తెచ్చిపెట్టుకొని, సిరిరా మోకా లొడ్డుచుండుటచే నేను విధిలేక బ్రహ్మచారినై యుండ వలసివచ్చినది.

మహా—దాంపత్యసౌఖ్యమునకై శాస్త్రయుక్తముగ ఒకమారు ప్రయత్నముచేసి కార్యము లేకపోవుటచే వైరాగ్యభావము వహించిన నేనే అజ్ఞానురాల నైనచో, ఏప్రయత్నము జరుగనిది అశాస్త్రీయముగ వైరాగ్య మవలంబించిన మిమ్ము ఏమనవలయునో నే నూహింపజాలకున్నాను

నేను—న న్నేమనవలయు నా?—భర్తయనుము—సంతోషించెదను.

మహా—మిమ్ము నేను భర్తగా పూజింపవలెనో, గురువుగా పూజింపవలెనో, దేవునిగా పూజింపవలెనో, నేనే నిర్ణయించుకొందును. ఆవిచారము మీకేల? మిమ్ము నేను భర్తగానే పూజింపవలసియున్నచో నాభర్త బ్రహ్మచర్యవ్రతదీక్షయం దుండవలసివచ్చుటచే ఆయనకు సహధర్మచారిణిని గనుక నేనుకూడ ఆయనతో పాటు బ్రహ్మచర్యము నవలంబించి నా ధర్మమును నెరవేర్చుకొనుచుంటి నని సంతృప్తి నందుచుందును.

నేను—అయితే నేను యావజ్జీవము బ్రహ్మచారిగా నుండుట యుత్తమకార్యమే యందువా?

మహా—నే నెట్లు చెప్ప గలను? అది మీ మనస్సును పట్టి యుండును.

"ఇట్లు ఇంకను పలువిధములగు సంభాషణములు జరిగినమీదట నా బ్రహ్మచర్యము దైవనిర్ణయ మేకాని స్వీయకల్పితము కాదని నాకు దృఢనిశ్చయము కలిగినది. మహాలక్ష్మి యట్టియచంచలదీక్షయం దుండగా నేనితరవనితను భార్యగా చేకొనుట పరస్త్రీగమనముతో సమాన మనిపించినది. ఆమెవైరాగ్యబలమెట్టిదో కడసారి పరీక్షింపగోరి, 'నాఫొటో నీయొద్దను, నీఫొటో నాయొద్దను ఉంచుకొనుటవలన మనకేమైనమనస్సంతుష్టి కలుగుచుండు నేమో' యని నేనంటిని. ఆమె అందుకొప్పుకొన లేదు."

మహా—నేను పూజించునది మీరూపమును కాదు. మీరు ప్రేమించునదియు నారూపము నైయుండకూడదని నా ప్రార్థన. రూపమును ప్రేమించుట కాముకుల వృత్తి. ఒండొరుల పవిత్రభావములనే మనము ప్రేమించుకొందము: అందుకై దగ్గరదూరములు కాని, చావుబ్రతుకులు కాని యెట్టి యాటంకమును గలిగింపనేరవు. మోక్షప్రాప్తి యగువరకు అనేకజన్మపరంపర లందు కలిసియుండవలసిన భార్యాభర్తలు పవిత్రజీవనులు కాకపోయినచో అది ఉభయులకును నష్టదాయకమే. అందులోను ఉత్తమజాతిస్త్రీ కులట యైపోవుటకన్న హీనకృత్యము వేరుండదు. దేశహితార్థమై రెండుమూడేండ్లు చెరసాలకు పోయిన దేశభక్తునిభార్య దుర్మార్గురాలై, భర్త తిరిగివచ్చునప్పటికి ఉపభర్తతో చరించుచుండుట ఎంతదోషమో, ఉత్తమజాతిస్త్రీ భర్తృమరణానంతరము పునర్వివాహము చేసికొనజూచుట యంత నీచమని నానమ్మకము.

"ఆమెయుద్దేశములు నేను పూర్తిగ గ్రహించినందున ఇక నక్కడ నుండ నవసరము లేదని తలచి యా ముగ్గురు వితంతువులవద్దను సెలవు గైకొని తిన్నగా ఇక్కడకు వచ్చి నిన్ను కలిసికొంటిని."

అన్నిసంగతులు విన్నతర్వాత కృష్ణారావు ఒక్క నిట్టూర్పు పుచ్చి "ఎవరియుద్దేశములకు తగినట్లు వారికి సంఘటనలు కలుగుచుండును. నీవును వైరాగ్యము కలవాడవే యగుటవలనను, పైగా ఛాందసుడ వగుటవలనను ఆమెను వివాహమున కొప్పించలేకపోయితివి."

శాస్త్రి—నీవు వెళ్లి ఒప్పించుము. నీకు లక్ష రూపాయ లిచ్చెదను. ఇదే పందెము.

కృష్ణా—నీవు రంగమంతయు జెడగొట్టితివి. ఆమెకు వైరాగ్యప్రసంగముల కవకాశ మీయక స్త్రీస్వాతంత్ర్యమునుగూర్చి భాషించుచు పౌరుషసూచకము

లగు మాటలాడి పురుషులకుగల వివాహాదిసౌకర్యము లన్నియు స్త్రీలకు గూడ నుండదగునని యామెకు తోపింపజేయవలసినది.

శాస్త్రి—కావలసినన్ని పౌరుషసూచకము లగు మాటలాడినాను. 'నీ మూఢభావములచే స్త్రీలోకమున కంతకు తీరనిద్రోహము చేయ నెంచుచున్నావు' అని లేనికోపమును తెచ్చుకొని పోటుమాటలాడినాను. కాని కాలహరణభయముచే నవియన్నియు నీ కిప్పుడు చెప్ప లేదు. ఇంతకును ఆమెదృక్పథము వేరుగ నున్నది.

కృష్ణా—నలుగురుబిడ్డలు గల కన్నతండ్రి పునర్వివాహమును ఆమె యెట్లు సమర్థించినది?

శాస్త్రి—ఆవిషయమై మహాలక్ష్మి చెప్పినమాటలివి: 'ఆయన వివాహమును జూచిన మీదటనే నా వైరాగ్యదీక్ష మరింతదృఢతర మయ్యెను. దయామయుడగు భగవంతుడు కల్పించుపరిస్థితు లన్నియు ఎండమావుల వంటి విషయసుఖములయందు విరక్తి కలిగించి మానవులను ముక్తిమార్గమునకు గొంపోవు దగ్గర దారులని నాకు కన్నులగట్టినట్లయినది. ఇంట్లో ముగ్గురు వితంతువులు మోక్షాసక్తలై పరిపూర్ణవైరాగ్యముతో సత్కాలక్షేపము జేయుచుండుటను భగవంతుడు నాకు కనబర్చి, కామమును నశింపజేసికొనిననే కాని నీకు ముక్తిలేదని సామమున బోధించినను నాకు బుద్ధి రానందున ఆజగదీశ్వరుడు నాకు శిక్షగా ఈవివాహము కల్పించెననియు, నిట్టిదాంపత్య మనుభవించుటకన్న నరక మనుభవించుట చాల నయమనియు మాబాబయ్యగారు అనుదినమును ఎంతో లోలోన అలమటించుచున్నారు. పైకికూడ విలపించు చున్నారు. మాపిన్ని మాబాబయ్యగారిని చీటికిమాటికి నిందించుచు, ఏడ్చుచు, తిట్టుచు, అనేక విధముల విసుగు కలిగించుచున్నది. సహజమార్గమున ఆయనకు వైరాగ్యభావ ముదయింపనందున జగద్రక్షకుడగు భగవంతు డాయనశ్రేయస్సును గోరియే యిట్టి కఠిన శిక్ష పాయము బూనవలసివచ్చెను'. మున్నగు తన మామూలు వైరాగ్యగ్రంథమే విప్పినది.

కృష్ణా—అయితే ఆమెతో సంభాషించిన తర్వాత బాలవితంతూద్వాహములను గూర్చి నీయభిప్రాయ మేమైన మారినదా?

శాస్త్రి—నా అభిప్రాయము కొంత చలించినది కాని మారలేదు. అందుకు విరోధము గాని యొక మధ్యమార్గ మేర్పర్చుకొని మనస్సమాధాన మొనర్చుకొంటిని. స్వరాజ్యప్రాప్తి చేకూరినపిదప దానిని గూర్చి ప్రచారము చేయ నిశ్చయించినాను.

కృష్ణా—ఆమధ్యమార్గ మేది?

శాస్త్రి—బాలికకు ఎనిమిదేండ్లు దాటినతర్వాత మంచి సంబంధమును చూచి తలిదండ్రులే వివాహము నిశ్చయముచేసి ప్రధానమువంటి చిన్న ఉత్సవము చేయవలెను. అప్పటినుండి వారు వధూవరులేయై రాకపోకలు జరిగించుచు పరస్పరానురాగము సంపాదించు కొందురు. స్త్రీ రజస్వలయైన రెండు సంవత్సరములకు కాని (పునస్సంధానమను) నిజమగు వివాహము జరుగరాదు. ఈ లోగా బాలికకు సనాతనమతధర్మానుసారముగా భక్తిజ్ఞానవైరాగ్యములు గల్గించు మంచి విద్యయంతయు చెప్పించవలెను. పునస్సంధానము జరుగుటకు పూర్వము ప్రధానపువరు డొకవేళ గతించినచో ఆమె యిష్టానుసార మామెకు మఱియొక వరుని నిరభ్యంతరముగా వివాహము చేయవలెను. ఆమెకు వివాహేచ్ఛ లేనిచో వైధవ్యసర్మనర్య నవలంబించుటకును, స్త్రీ విద్యాలయములం దధ్యాపకురాలుగ నుండుటకును మంచి యవకాశములు కల్పించవలెను.

కృష్ణా—ఈ యేర్పాటునకు మీ మహాలక్ష్మి యొప్పుకొనునా?

శాస్త్రి—ఆమె తన విశ్వాసమునుండి నలుసంతైన కదలదు. 'మీపద్ధతి "నీయెడమ చెయ్యి తియ్యి, నాపుల్లచెయ్యి పెట్టెద" నన్నట్లున్నది' అని ఆమె పరిహసించినది. కాని ఈ కలికాలములో నిరక్షరకుక్షులగు బాలవితంతువుల యెడల నిర్బంధవైధవ్యము విధించుట మహాక్రూరత్వ మనియే నాతలంపు.

కృష్ణా—సరే. నీవును, మహాలక్ష్మియు నిరంతర కృషి చేసి హింధూబాలవితంతువులకు భక్తిజ్ఞానవైరాగ్యములను గల్గించు సద్విద్య నేర్పెడు గొప్పవిద్యాలయములను స్థాపించుట కేల ప్రయత్నింపరు? కార్యరూపమున బుజువుపర్చిన కాని విద్యావలన వితంతువులను పవిత్రురాండ్రగా నుంచవచ్చుననుట సంభవ మని నేను దలపను.

శాస్త్రి—మహాలక్ష్మి తన కట్టిసంకల్ప మున్నదనియు, అందుకు నా సహాయ మత్యావసరమనియు కూడ చెప్పినది. కాని 'స్వరాజ్యము రానిదే యిట్టి పవిత్ర కార్యములు నిర్విఘ్నముగాకొనసాగవు. కాబట్టి తొలుత స్వరాజ్యసంపాదనకే నాసర్వస్వమును, అవసర మైనచో నాప్రాణమును కూడ నర్పింప దలచితిని. నీవాంధ్రరాష్ట్రమందలి స్త్రీలలో స్వరాజ్యవాంఛను ప్రబలంజేసి, త్రివిధబహిష్కారములకును, నిర్మాణ కార్యక్రమమునకును బూనుకొనునట్లు వారిని ప్రోత్సహించుట ప్రస్తుత కర్తవ్యము' అని నే నామెతో చెప్పి ఒప్పించితిని.

కృష్ణా—సరే, రావలసిన మార్పులు భగవదిచ్ఛవలన రానే వచ్చుచున్నవి. మనము కాళ్లు విరుగ ద్రొక్కుకొని పరువు లెత్తుట యవవసరము.

శాస్త్రి—అవునవును. స్వరాజ్యముకొఱకు ప్రయత్నించుట యనినచో నీకుశుద్ధ అనవసరముగా కనబడును. వితంతూద్వాహము లన్నను, పర్ణాంతరభోజనములన్నను మాత్రము నడుము కట్టుకొని తయా రగుదువు.

కృష్ణా—సరి లే. ఎవరివెఱ్ఱి వారి కానందము.

కథ ముగియుటచే మిత్రు లిద్దరును నవ్వుకొనుచు లేచి, జగన్నాటక మందలి విచిత్రపాత్రముల వైఖరి నెన్నుకొనుచుఁ జని తమతమ గృహములు చేరు కొనిరి.

ప్రియపాఠకులారా! మన మహాలక్ష్మివంటియు, సీతారామశాస్త్రివంటియు జితేంద్రియులగు పావనమూర్తులు మనసార పూనుకొన్నప్పుడే యేయుద్యమమైన నిర్విఘ్నముగ ఫలవంతమగుననుట మాత్రము మీ రందరేకగ్రీవముగ నంగీకరించినచాలునని కథకుని ప్రార్థన.

---

అజంతా చిత్రములు



౧. గానము చేయుచున్న గంధర్వులు